క్లుప్తంగా

గాయపడిన బాలుడికి ఆర్థిక సహాయం

మంగళగిరి టౌన్: ప్రమాదంలో గాయపడిన ఓ బాలుడికి గివింగ్ బ్యాక్ టూ సొసైటీ ఆర్థిక చేయూతనిచ్చింది. మంగళగిరి మండల పరిధిలోని ఎర్రబాలెం ఎస్టీ కాలనీకి చెందిన కల్యాణ్ అనే బాలుడికి ఐరన్ గేటు తగలడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సంస్థ బాలుడి వైద్యఖర్చుల నిమిత్తం మంగళవారం రూ.20 వేల చెక్కును మంగళగిరి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర చేతుల మీదుగా బాలుడి తండ్రి ప్రశాంత్‌కు అందజేశారు.

వేమవరంలో పొలం పిలుస్తోంది

ఫిరంగిపురం: మండలంలోని వేమవరంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తొలకరి వర్షాలు కురుస్తున్నప్పుడు పొలం దున్నుకున్న తరువాత భూసారం పెరుగుదలకు పచ్చిరొట్ట ఎరువులు సాగుచేయాలని ఏవో వాసంతి చెప్పారు. విస్తరణాధికారి సుభాని, సాంబశివరావు, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు మంగళవారానికి 196వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరాన్ని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు ప్రారంభించి వారికి మద్దతు తెలియజేశారు. సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని విమర్శించారు.నాయకులు,కార్మికులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో నాణ్యమైన సరుకులు

ఫిరంగిపురం: తక్కువ ఖర్చుతో నాణ్యమైన సరుకులు అందించడమే వెలుగు మహిళమార్టు లక్ష్యమని జిల్లా వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ టి.వి. విజయలక్ష్మీ అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు మహిళమార్టును మంగళవారం ఆమె పరిశీలించారు. ఆమె వెంట ఏపీఎం నాగేశ్వరరావు, సీసీ కరిముల్లా, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థి చదువుకు సహాయం

మేడికొండూరు: పాములపాడుకు చెందిన నేతగాని ప్రవల్లిక చదువుకు స్ఫూర్తి ఫౌండేషన్ సహాయం అందించింది. సంస్థ చైర్మన్ శ్రీవ్యాల్ విద్యార్థిని చదువుకు రూ.1.15 లక్షల చెక్కును పంపగా.. ప్రతినిధి కె.శివప్రసాద్, ప్రవల్లికకు మంగళవారం చెక్కును అందజేశారు.

‘వెన్నుపోటు’ పుస్తక ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్: జగన్ అంటే నమ్మకం... చంద్రబాబు అంటే మోసం అని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ తాడేపల్లి పట్టణ, రూరల్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో వెన్నుపోటు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని అంజిరెడ్డి భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఈదులమూడి డేవిడ్ రాజు, రూరల్ పార్టీ అధ్యక్షులు అమరా నాగయ్యలు మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలను ఏడాదిలో అన్నీ అమలు చేశారని అన్నారు. రాష్ట్రంలో ప్రజల ఆర్థిక పరిస్థితి.. రైతులు పడుతున్న ఇబ్బందుల అంశాలను ప్రస్తావిస్తూ వెన్నుపోటు పుస్తకంలో వివరించామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, పట్టణ, రూరల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుగ్గిరాల: దుగ్గిరాల రైలు పేటలోని నాగరాజు ఇంటి వద్ద మంగళవారం జరిగిన వెన్నుపోటు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు డి.అరుణ పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తల సమక్షంలో ఆమె వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరించారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.



తాడేపల్లి అంజిరెడ్డి భవన్ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు

మోసపూరిత హామీలు, అబద్ధపు మాటలతో అధికారంలోకి ఎక్కిన బాబు ప్రజలకు ఏవిధంగా వెన్నుపోటు పొడిచారో ఈ పుస్తకంలో వివరించారని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు టి.శివగోపయ్య, మైనార్టీ సీనియర్ నాయకులు షేక్.సుభాని, బీసీ మండల నాయకులు ఎన్.వెంకట్రావు, ఎ.మహేష్, మండల మహిళా అధ్యక్షురాలు సి.సంసోనమ్మ, సీనియర్ పార్టీ నాయకులు ఎ.ధనుంజయ్, ఎన్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలు గమనిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఎన్నో పథకాలు అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం వాటి అమలులో విఫలమయ్యిందన్నారు. అనంతరం జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో కొమ్మారెడ్డి, చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, దాసరి సురేష్, చేవూరి రామమోహన్‌రెడ్డి, బి.అంజిరెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, పెరికల చిన్నా, బి.సాల్మన్, హేమలతారెడ్డి, పి.జోసఫ్‌కుమార్, పి.శ్రీనివాసరెడ్డి, మణికంఠారెడ్డిలు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు శివరామిరెడ్డి

అమెరికా ప్రోద్బలంతో బాంబు దాడులు



ప్రాతూరు నిరసన కార్యక్రమంలో నాయకులు



అంబేద్కర్ సెంటర్‌లో నిరసన

తాడేపల్లి రూరల్: అమెరికా ప్రోద్బలంతో జరుగుతున్న బాంబు దాడులను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఉండవల్లి సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.రవి, సీపీఎం రాజధాని డివిజన్ నాయకులు టి.బక్కిరెడ్డి, ఈమని రామారావు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, రాఘవయ్య, కె.రామకృష్ణ, పార్థసారథి, హనుమంతరావు పాల్గొన్నారు. ప్రాతూరులో జరిగిన కార్యక్రమంలో పల్లె కృష్ణ, జొన్న శివశంకరరావు, కె.కాశయ్య, టి.వెంకటయ్య, కాజా వెంకటేశ్వరరావు, ఎ.రంగారావు, డి.రాజేంద్రబాబు, విజయరాజు, షేక్ గస్, లెనిన్, జయరావ్ పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: ఇజ్రాయిల్ బాంబు దాడులను నిరసిస్తూ అంబేద్కర్ సెంటర్‌లో నిరసనను నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి వీవీ జవహర్‌లాల్, నాయకులు చెంగయ్య, జేవీ రాఘవులు, పి.బాలకృష్ణ, కమలాకర్, బాలాజీ, సీపీఐ, సీపీఐఎంఎల నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

మంగళగిరి టౌన్: స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ ఆత్మకూరులో మంగళవారం సీపీఎం పార్టీ నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ఆదాని స్మార్ట్ మీటర్లను పగలకొట్టమని, అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ ఛార్జీలు, ఇంటిపన్నులు పెంచబోమని వాగ్దానాలు చేసి నేడు ప్రజలపై వాటి భారాన్ని మోపారని విమర్శించారు. మంగళగిరి నగరపాలక సంస్థకు టార్గెట్లు పెట్టి ఇంటిపన్నులు 30 శాతం నుంచి 50 శాతం పెంచుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఉద్దండి దుర్గారావు, నాయకులు మునలి పకీరయ్య, గడ్డం అజయ్‌కుమార్, జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లావాదేవీలపై అవగాహన

ఫిరంగిపురం: గొల్లపాలెం పంచాయతీ కార్యాలయంలో భారతీయ రిజర్వు బ్యాంకు, ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో లావాదేవీలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కె.సాల్మన్‌పాల్, వెలుగు కమ్యూనిటీ కోఆర్డినేటర్ రమాదేవి, సంస్థ రిసోర్స్ పర్సన్స్ వెంకటేశ్వరరావు, షేక్ బాజీ, తురకా మంగయ్య, వెలుగు మహిళ సమాఖ్య అధ్యక్షురాలు చిరంజీవి, యానిమేటర్లు, గ్రామసర్పంచ్ మెల్కియా పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డిపాజిటర్ ఎడ్యుకేషన్‌పై అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ జి.నాగేశ్వరరావు, రిసోర్స్‌పర్సన్లు వై.శ్రీనివాసరావు, ఆర్ఎస్ శంకరరావు, ఆర్బిడ్స్ కార్యదర్శి సాంబశివరావు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసులు

తాడికొండ: తాడికొండ మండలం పాములపాడు గ్రామంలో ఇరువర్గాలు వివాదాలకు దిగి రాళ్లు రువ్వుకున్న ఘటనలో ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో ఎస్సీ కాలనీలోని ఇరువర్గాలు గత రెండు రోజులుగా దాడులకు పాల్పడుతూ రాళ్ల దాడులకు పాల్పడుతుండడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు తల్లికి వందనం వర్తింపజేయాలి

మంగళగిరి టౌన్: తల్లికి వందనం పథకం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు వర్తింపజేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు పారిశుద్ధ్య కార్మికులకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. అనంతరం ఎంటీఎంసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మంగళగిరి పట్టణ అధ్యక్షురాలు వెంకటేశ్వరమ్మ, నాయకులు శివనాగేశ్వరరావు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, పారిశుధ్య కార్మికులు

టీడీపీ పట్టణ, మండల అధ్యక్షుల నియామకం

మంగళగిరి టౌన్: టీడీపీ పట్టణ, మండల, తాడేపల్లి మండల అధ్యక్షులను నియమిస్తూ మంగళవారం పార్టీ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. మంగళగిరి పట్టణ అధ్యక్షులుగా పడవల మహేష్, మండల అధ్యక్షులుగా పల్లబోతుల శ్రీనివాసరావు, తాడేపల్లి మండల అధ్యక్షులు దాసరి కృష్ణలు నియమితులయ్యారని ఆ ప్రకటనలో పేర్కొంది.

ఎదురెదురుగా ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

దుగ్గిరాల: మంగళగిరి-తెనాలి మెయిన్ రోడ్డులో ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొనడంతో రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ సంఘటన మంగళవారం తుమ్మపూడి దగ్గర చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. తెనాలి నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. బస్సు డ్రైవరు చాకచక్యంగా బ్రేక్ వేయడంతో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరుగలేదు. ఘటనా స్థలంలో ట్రాఫిక్ భారీగా ఆగిపోవడంతో దుగ్గిరాల ఎస్సై ఎస్.వెంకట రవి సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు.



కలుషిత తాగునీటిపై గ్రామస్తులు ఆగ్రహం

మందడం(తాడికొండ): మందడం గ్రామంలో తాగునీరు సక్రమంగా అందడం లేదంటూ మహిళలు, గ్రామస్తులు కలుషిత నీటి బక్కెట్లతో మంగళవారం రోడ్డెక్కారు. గ్రామంలో సరఫరా చేస్తున్న నీటిలో మురుగు కలిసి సరఫరా జరుగుతుండటంతో కనీస వాడుకకు ఇబ్బందిగా మారుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా ఫలితం లేదని వాపోయారు. రోడ్డుపై బైఠాయించి వాహనాలకు అడ్డుగా మురుగునీటి బక్కెట్లను పెట్టి రాస్తారోకో చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సముదాయించారు. అధికారులు సమస్య పరిష్కారం చేస్తామని తెలుపడంతో రాస్తారోకో విరమించారు.



నీటి బక్కెట్లతో రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

దుర్వాసన కలిగిన కలుషిత నీరు

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

తాడికొండ: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ కె.వాసు తెలిపారు. పొన్నెకల్లు గ్రామానికి చెందిన వివాహిత శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. పరిసర గ్రామాలు, కుటుంబ సభ్యుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.